

పదేళ్లుగా సబ్ కలెక్టరేట్‌లో పాగా..

రెవెన్యూ శాఖ గుండె లాంటింది సబ్ కలెక్టరేట్.ఇద్దరు ఉద్యోగులు కార్యాలయాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. పదేళ్ల నుంచి డిప్యూటేషన్ పేరుతో ఇక్కడే పాగా వేశారు. -8లో



గండి ఆంజన్న దర్శనానికి ఏర్పాట్లు

శ్రావణమాసంలో మూడో శనివారం భారీ సంఖ్యలో భక్తులు వచ్చేఅవకాశం ఉండడంతో గండి క్షేత్రంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.470
రెండోరకం	రూ.200	రూ.360

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 120 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

సెలవురోజుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల పాఠశాలలు ప్రభుత్వం ప్రకటించిన సెలవు దినాలలో పాఠశాలలు నిర్వహించరాదని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా పాఠశాలలు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధర్మకర్తలమండలి నియామకానికి దరఖాస్తులు

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా నాలుగు ఆలయాలకు సంబంధించి ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అధికారి సి. విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయం, మదనపల్లె పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం, గుర్రంకొండ మండలం చెర్లోపల్లిలోని శ్రీ రెడ్డెమ్మ దేవస్థానం, తంబల్లపల్లెలోని మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి ఆలయాల ధర్మకర్తల మండళ్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 26 లోగా దేవదాయశాఖ వారు ఇచ్చిన ప్రొఫార్మా ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాస్థాయి హాకీ ఎంపికలు



క్రీడాకారులతో జిల్లా హాకీ సెక్రటరీ తదితరులు

రాయచోటి జగదాంబసెంటర్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి హాకీ పోటీలకు ఎంపికలు శుక్రవారం జరిగినట్లు జిల్లా హాకీ సెక్రటరీ నాగేశ్వరరావు తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు జోనల్ స్థాయిలో తిరుపతిలో జరిగే హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ ఫౌండర్ చంద్రశేఖర్, శాప్ కోచ్ చంద్రశేఖర్, రాజు స్కూల్ హాకీ కోచ్ నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లాలోని కుంభంవారిపల్లి (కేవీపల్లి)లో 110.2 మిల్లీమీటర్లు, కోడూరులో 107.2 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. పుల్లంపేట 5.4, గుర్రంకొండ 6.6, రామసముద్రం 7.2, కురబలకోట 10 మిల్లీ మీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. నందలూరు 96.4, చిన్నమండెం 92, కలికిరి 72.2, రాజంపేట 69.8, టి సుండుపల్లి 60.2, పెద్దమండెం 57.8, బి కొత్తకోట 55, ములకల చెరువు 42, నిమ్మనపల్లి 41.4, కలకడ 40.2, వాల్మీకిపురం 38.4, పెద్దతిప్ప సముద్రం 37, సంబేపల్లి 36.4, తంబళ్లపల్లి 36.4, గాలివీడు 34.4, రామాపురం 33.4, పీలేరు 34.4, లక్కిరెడ్డిపల్లి 30., రాయచోటి 27.2, వీరబల్లి 27. చిట్వేలి 24.8, ఓబులవారిపల్లి 24, మదనపల్లి 16.2, పెనగలూరులో 12.8 మిల్లీ మీటర్లు వంతున వర్షం కురిసింది.

వేడెక్కిన ప్రచారం

- టీడీపీ అభ్యర్థికి మద్దతుగా మంత్రులు
- పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం
- ఎన్నికలకు గడువు దగ్గర పడుతుండటంతో పోలింగ్‌పై దృష్టి సారించిన పోలీసులు



చింతరాజుపల్లిలో మాజీ జెడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం ప్రచారం



మృకుందాశ్రమంలో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

సాక్షి, రాయచోటి: ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలను కూటమి సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో అడ్డదారుల వైపు అడుగులు వేస్తున్నారు. సాధారణ జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కూడా ప్రత్యేకంగా మంత్రుల మకాం వేసి అధికార దుర్వినియోగం చేస్తున్నారు. ఎలాగైనా సరే గెలవాలన్న సంకల్పంతో అవసరమైన అన్ని వనరులను ఉపయోగిస్తున్నారు. అధికారంలో ఉండటంతో ఓడిపోతే సర్కార్ ప్రతిష్ఠ మంటగలుస్తుందన్న ఆలోచనతో ఇతర పార్టీల వారిని భయపెట్టడమో.. ఆదుకుంటామని చెబుతూ పార్టీలో చేర్చుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. అయితే ఆది నుంచి కూడా ఏళ్ల చరిత్రను పరిశీలిస్తే ఒంటిమిట్టతో పాటు పులివెందుల లాంటి కేంద్రాల్లో తిరుగులేని ఆధిక్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే. అయితే ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంటిమిట్ట జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి మద్దతుగా పార్టీ నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు.

గెలుపే లక్ష్యంగా..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ముందుకు అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే ఎక్కడికక్కడ ప్రజల్లో పట్టున్న వారితో చర్చించడంతో పాటు మాట్లాడి ఓట్లు భారీగా పడేలా వ్యూహరచన చేస్తున్నారు. మరోపక్క ప్రచారంలో ప్రజలతో కలిసిపోయి... వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నారు. ఓటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి వేయాలంటూనే ఎన్నికల ముందు హామీలిచ్చి తరువాత విస్మరించిన కూటమి సర్కార్ మోసాలను కూడా వివరిస్తున్నారు. టీడీపీ వేస్తున్న ఎత్తుగడలను ఎప్పటికప్పుడు చిత్తు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు నేతలు ప్రచారంలో దూసుకుపోతున్నారు.

- ఒంటిమిట్ట మండలంలో తెలుగుదేశం పార్టీ జెడ్పీటీసీ అభ్యర్థి కృష్ణారెడ్డికి మద్దతుగా రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఫరూక్‌లతో పాటు పలువురు నాయకులు ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఒంటిమిట్ట జెడ్పీటీసీకి సంబంధించి ఈ నెల 12వ తేదీన ఎన్నిక జరగనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఒంటిమిట్టతో పాటు మంటపంపల్లి, ఇతర అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్, ఇతర అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఎక్కడికక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలను కింది స్థాయి అధికారులను ఆదేశించారు.

రాజకీయ సంప్రదాయాన్ని మంటగలిపారు

ఒంటిమిట్ట ఉప ఎన్నిక ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నేతలు



చింతరాజుపల్లిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్ కుమార్ రెడ్డి ప్రచారం

ఒంటిమిట్ట: ఒక పార్టీ నుంచి గెలిచిన వ్యక్తులు ఏదేని కారణం చేత చనిపోతే వారి స్థానంలో కుటుంబ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం రాజకీయ సంప్రదాయం. అలాంటి సంప్రదాయాన్ని పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక విషయానికి వచ్చే సరికి టీడీపీ మంటగలిపిందని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతరాజుపల్లి, మృకుందాశ్రమం, శ్రీకోదండ రామనగర్ కాలనీ, ఒంటిమిట్ట ఎస్సీకాలనీల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి కడప మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి ప్రచారం చేశారు. సాయంత్రం అభ్యర్థితో కలిసి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, కడప పార్లమెంట్ పరిశీలకులు అజయ్ రెడ్డి సంఘీభావం తెలిపి, ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

- బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మాట్లాడుతూ.. రెండు సార్లు జెడ్పీటీసీ గా గెలిచిన ఇగరంరెడ్డి సుబ్బారెడ్డి ని ముచ్చటగా మూడోసారి గెలిపించాలని ఆమె కోరారు.
- కడప నగర మేయర్, రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు సురేష్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తోంది. ఇంత వరకు వారు చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. అలాంటి మోసపూరిత ప్రభుత్వానికి మన బుద్ధి చెప్పాలంటే ఈ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నాం అని నిరూపిద్దామన్నారు.
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాన్ని నడిపిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. ఈ ప్రభుత్వాని బద్ధి చెప్పాలంటే ఈ ఉప ఎన్నికలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సుబ్బారెడ్డిని గెలిపించాలని కోరారు.
- ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ...ఈ ఉప ఎన్నికలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, అవసరమైతే ప్రాణాలకు తెగించి మన పార్టీ ఉనికిని కాపాడుకోవాలని తెలిపారు.
- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ..ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి రాజంపేట ఎమ్మెల్యే అయినందున జెడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఇక్కడ జెడ్పీటీసీ ఉప ఎన్నిక వచ్చిందన్నారు. ఈ ఎన్నికలో ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.
- రాష్ట్ర అధికార ప్రతినిధి, రాయచోటి మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ కంచు కోట అయిన కడప జిల్లాలోని రెండు జెడ్పీటీసీ స్థానాలు గెలుచుకోవడానికి టీడీపీ సామవేద దండోపాయాలను ఉపయోగిస్తున్నారని, ఎవరెన్ని పన్నాగాలు పన్నినా ఒంటిమిట్ట, పులివెందుల మండలాలలో వైఎస్సార్‌సీపీ జెండా పాతడం ఖాయమని ఆయన తెలిపారు.
- మాజీ జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోరే నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయితే రాష్ట్ర సుభిక్షంగా ఉంటుందన్నారు.
- రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి మాట్లాడుతూ... పోలీసులు రాజ్యాంగాన్ని గౌరవించి, నిష్పక్షపాతంగా ఈ ఉప ఎన్నికలను నిర్వహించాలని కోరారు.
- కడప పార్లెంట్ పరిశీలకులు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ..ఒంటిమిట్ట మండలంలో ఎవ్వరి నోట విన్నా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలే చెబుతున్నారన్నారు. ఈసారి మాత్రం తప్పక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని తెలిపారు.
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. గతంలో రెండు సార్లు తనను జెడ్పీటీసీగా గెలిపించారని, ఈసారి కూడా గెలిపించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్యరెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు రాజమోహన్ నాయుడు, మండల ప్రచార విభాగ అధ్యక్షుడు రాజశేఖర్ రాయల్, రవిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకొత్తపల్లిలో అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్న బద్వేలు ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

‘హరిత’ వేదికగా ఎల్లో పాలిట్రిక్స్

- ఒంటిమిట్టకు కదులుతున్న కేబినెట్
- హరిత హోటల్‌లో మంత్రుల మకాం
- కార్యకర్తలతో బహిరంగంగా సమావేశాలు



హరిత రెస్టారెంట్‌లో కార్యకర్తలు, నాయకులతో కలిసి ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి (వృత్తంలో)

రాజంపేట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక వైఎస్సార్‌సీపీకి అనుకూలమనే సంకేతాలతో టీడీపీ అధిష్టానం రాష్ట్ర కేబినెట్‌ను ఇక్కడికి పంపుతోంది . రోజుకొక మంత్రి వస్తున్నారు. ఒక్క జెడ్పీటీసీ స్థానం కోసం కేబినెట్ కదిలిరావడం చూసి ఓటర్లు ఆశ్చర్యచకితులవుతున్నారు. కులాలవారీగా మంత్రులను రంగంలోకి దింపుతున్నారు. శుక్రవారం రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఫరూఖ్‌లు ఒంటిమిట్టలో వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా ఓటర్లను ప్రసన్నం చేసుకున్నారు. పోలింగ్ నాటికి ఎంతమంది మంత్రులు దిగుతారో చెప్పలేని పరిస్థితి. తమవంతుగా జనసేన నుంచి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్,ఎమ్మెల్సీ అనురాధలు ఉన్నారు.

- ఆదినుంచి వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉన్న ఒంటిమిట్టలో జెడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని అధికారపార్టీ పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మంత్రులను ఒంటిమిట్టకు పంపిస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే డబ్బులు, పనులను ఎరవేస్తున్నారు. అయినప్పటికీ ఒంటిమిట్ట మండల వాసులు కూటమి అధికారబలానికి తలొగ్గడంలేదు. దీంతో టీడీపీ అధిష్టానం ఆందోళనకు గురవుతోంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ ప్రచార పర్వంలో దూసుకుపోతోంది. ఏ గ్రామానికి వెళ్లినా జనం నుంచి అనుహ్య స్పందన లభిస్తోంది.
- ఒంటిమిట్టకు వస్తున్న మంత్రులకు మాత్రం ఎన్నికల కోడ్ వర్తించడంలేదు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని ఈ ఎన్నికల్లో గెలుపొందాలనే ఉద్దేశంతో సర్వం ఒడ్డుతున్నారు. ఎన్నికల కోడ్‌ను అధికారులు పక్కాగా అమలు చేయాలి.అయితే ఆ పరిస్థితులు ఇక్కడ కనిపించడంలేదు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ఒంటిమిట్టలో అమలుకావడంలేదన్న విమర్శలున్నాయి.
- ఒంటిమిట్ట రామాలయానికి సమీపంలో ఉన్న ఏపీ టూరిజంకు సంబంధించిన హరిత హోటల్ ఇప్పుడు జెడ్పీటీసీ ఉపఎన్నికల్లో ఎల్లో పాలిట్రిక్స్‌కు వేదికగా మారిందన్న విమర్శలు వెలువడ్డాయి. ఇక్కడి నుంచి మంత్రుల మంతనాలు, కార్యకర్తలు, నాయకుల భేటీలు జరిగిపోతున్నాయి.అయితే హరిత హోటల్ నిర్వాహకులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. యాత్రికులు వచ్చేందుకు వీలులేని పరిస్థితులు ఏర్పడ్డాయి.ఇది హరిత హోటలా..కూటమి కార్యాలయమా అన్న అనుమానాలు తలెత్తున్నాయి.
- ఈనెల 12న ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉపఎన్నిక పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు ఎక్కడా కనిపించడంలేదు. ఎన్నికల అధికారులు కూడా పత్తా లేకుండా పోయారనే విమర్శలున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ నాటికి పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఒంటిమిట్ట ప్రాంతీయులు భయాందోళనకు గురవుతున్నారు.

ఒక జిల్లా అధికారి.. ఐదు పోస్టులు!

మదనపల్లె: జిల్లా సహకారశాఖలో వింత పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడైనా ఒక పోస్టు ఖాళీ ఉంటే.. కింది అధికారినో లేక పై అధికారికో కొన్నాళ్లు అదనపు బాధ్యతలను అప్పగించడం సాధారణ విషయం. అది కూడా పాలనాపరమైన సౌలభ్యం కోసం. అయితే సహకార శాఖలో నెలకొన్న పరిస్థితులు ఆశ్చర్యపోయేలా ఉన్నాయి. జిల్లా సహకారశాఖ అధికారికి ఐదు పోస్టులకు ఇన్‌చార్జి అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ఇక ఆయన ఎక్కడినుంచి విధులు నిర్వహిస్తారో కాని సహకార శాఖ పాలనాపరంగా కుదేలైంది. వివరాల్లోకి వెళితే..జిల్లా సహకార శాఖ అధికారిగా సి.గురుప్రసాద్‌రావు విధులు నిర్వహిస్తున్నారు. మదనపల్లె, రాజంపేట సహకార డివిజనల్ కార్యాలయాలు ఉండగా వాటికి డీఎల్‌సీఓలు లేరు. మదనపల్లెకు కొంతకాలం ఇన్‌చార్జి డీఎల్‌సీగా శ్యామ్‌ప్రకాష్ రెడ్డి బాధ్యతలు నిర్వహించారు. తర్వాత ఏమైందో ఆయన్ను తొలగించారు. దీంతో మదనపల్లె డీఎల్‌సీఓ పోస్టు ఖాళీ కావడంతో డీసీఓయే ఎఫ్ఏసీ డీఎల్‌సీఓగా బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట డీఎల్‌సీఓ పోస్టు కూడా ఖాళీగా ఉండటంతో ఆ పోస్టు ఇది కూడా డీసీఓకే ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు బాధ్యతలు చేపట్టిన ఆయ నకు జిల్లా సహకారశాఖ ఆడిట్ అధికారి పోస్టు కూడా అదనంగా కట్టబెట్టారు. జిల్లాకు సంబంధించి ఈ పోస్టుల విధులను నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆయనకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు, కడప డీఎల్‌సీలు సెలవులో వెళ్లడంతో ఈ రెండు బాధ్యతలను అప్పగించారు. ఈనెల 11 వరకు వీరిద్దరు సెలవు పెట్టారు. 12న తిరిగి విధుల్లోకి చేరేదాకా రాయచోటి డీసీఓ ఐదు పోస్టులకు ఏక్ నిరంజన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తారు. కాగా రాజంపేట, మదనపల్లె డీఎల్‌సీఓ పోస్టులకు డీఎల్‌సీఓ కిందిస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగిస్తే పాలనాపరమైన సౌలభ్యం ఉంటుంది. విధుల నిర్వహణ, కార్యకలాపాలకు ఇబ్బందులు ఉండవు. దీన్ని విస్మరించి ఒకే అధికారికి అన్ని బాధ్యతలు అప్పగించడంతో జిల్లాలో సహకారశాఖ పాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై డీసీఓ గురుప్రసాద్‌రావు మాట్లాడుతూ పోస్టులు ఖాళీగా ఉండటంతో తనను ఇన్‌చార్జిగా నియమించారని చెప్పారు.

ఖరీఫ్.. ఖతం

- వ్యవసాయశాఖ చరిత్రలో దారుణమైన పరిస్థితి
- 62,178 హెక్టార్లకు సాగైంది కేవలం 5,655 హెక్టార్లలోనే
- ఇలాంటి పరిస్థితి ఎన్నడూ ఎరుగని రైతాంగం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రెండో ఏడాది కుదేలైన వ్యవసాయం



తంబళ్లపల్లె నియోజకవర్గంలో బీళ్లుగా వదిలేసిన పొలాలు

మదనపల్లె: జిల్లా ఖరీఫ్ వ్యవసాయ చరిత్రలో ఎరుగని దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, పంటల దిగుబడిపై ప్రభావం చూపడం జరిగేది. మొదటిసారి రైతులు పంటనే సాగు చేయలేని దయనీయమైన పరిస్థితి మొదటిసారి కనిపిస్తోంది. వెంటాడుతున్న వర్షాభావం, చినుకు కరువు కావడం, పంటలు పెట్టలేని పరిస్థితికి దారితీసినప్పటికి ఊహకందని విధంగా సాగు విస్తీర్ణంలో 90.08 శాతం భూములు బీళ్లుగా మారడాన్ని రైతాంగం జీర్ణించుకోలేకపోతోంది. ఇప్పటికే పెట్టిన 9.92 శాతం పంటలు కూడా చేతి కందే పరిస్థితి లేదు. వ్యవసాయంపై పెట్టుబడు పెట్టి పంటలు సాగు చేసే రైతాంగం తీవ్రస్థాయిలో నష్టపోతోంది. ఇప్పటి పరిస్థితులు ఇంకెంత కాలం వెంటాడుతాయో అన్న ఆందోళన వారిలో వ్యక్తం అవుతోంది.

దారుణమైన సాగు

ప్రస్తుత ఖరీఫ్‌లో పంటల సాగు విషయంలో వ్యవసాయశాఖ జిల్లా వ్యాప్తంగా 62,178 హెక్టార్లలో 32 రకాల పంటలు సాగవుతాయని ప్రణాళిక అమలు చేసింది. నిర్ణయించిన సాగు విస్తీర్ణంలో అన్ని పంటలు సాగవ్వాలి. అయితే ఆగస్టు నాలుగో తేదీనాటి లెక్క ప్రకారం సాగైన పంటలు పది మాత్రమే. ఇందులోనూ అతి తక్కువ విస్తీర్ణం. సాగు ప్రణాళికలో ప్రధానమైన పంట వేరుశనగ, రైతులు ఈ పంటపైనే అత్యధికంగా ఆధారపడి సాగు చేస్తారు. పంట పూర్తయ్యాక ధర పలుకుతుందని ఆశలు పెట్టుకుంటారు. ఇలాంటి పంట జిల్లాలో 40,639 హెక్టార్ల సాగు అవుతుందని భావించి దానికి తగ్గట్టుగా రాయితీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. అయితే ఈనెల నాలుగు నాటికి 2,870 హెక్టార్లలోనే విత్తనం పడింది. ఈ పంట కూడా చేతి కందే పరిస్థితి కనిపించడం లేదు.

వర్షపాత వివరాలు (మి.మీ)

నెల	కురవాల్సింది	కురిసింది	లోటు
జూన్	75.1	17.9	76.2
జూలై	90.5	73.7	18.2
ఆగస్టు	99.8	-	100.0

వెంటాడుతున్న వర్షాభావం

జిల్లాలో వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. గత ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా సాగు చేసిన పంటలు చేతికందలేదు. పెట్టిన పెట్టుబడి కోల్పోయిన రైతాంగానికి కూటమి ప్రభుత్వం 19 మండలాల్లో కరువు ఉందని ప్రభుత్వం ప్రకటించింది. పంట నష్టాలపై నివేదికలు వెళ్లినా ఇప్పటిదాకా పైసా పరిహారం చెల్లించలేదు. ఇదే పరిస్థితి ప్రస్తుత ఖరీఫ్‌లో పునరావృతమైంది. జూన్ నుంచే వర్షాలు ఆశించిన మేరకు కురవలేదు. వాతావరణంలో మార్పులు కనిపించడంతో పంటలు బాగా పండుతాయని ఆశించిన రైతాంగానికి ఖరీఫ్ ప్రారంభంలోనే నిరాశ మిగిలింది. జూన్‌లో తీవ్ర వర్షపాత లోటు ఉండగా అది జూలై నెలలోనూ కొనసాగింది. దీంతో పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. జూలైలో ఒక్క మండలంలోనూ అధిక వర్షం కురవలేదు. నాలుగు మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదవగా, 20 మండలాల్లో 20 నుంచి 59 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆరు మండలాల్లో అతితక్కువ వర్షపాతం నమోదైంది. కూటమి ప్రభుత్వం వచ్చాకా వరుసగా రెండో ఏడాది దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయరంగం కదేలైంది.

ఆరెకరాలు బీడు



ఆర్‌ఎస్‌తాండాలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నిరుడు ఈ భూమిలో వేరుశనగ సాగు చేస్తే పెట్టుబడి మొత్తం నష్టపోయాను. పైసా దక్కలేదు. ప్రస్తుతం వేరుశనగ సాగు చేసేందుకు పెట్టుబడి, విత్తనం సిద్ధం చేసుకున్నప్పటికి వర్షం లేదు. ఫలితంగా విత్తనకాయలను విక్రయించక తప్పదు. వర్షాభావంతో పంటల సాగుచేయలేక ఇబ్బంది పడుతున్నాం.

–కష్టా నాయక్, ఆర్ఎస్‌తాండ, తంబళ్లపల్లె

సాగు చేయలేక..



15 ఎకరాల పొలం ఉన్నప్పటికి ఖరీఫ్‌లో పంటలు సాగుచేయలేక బీళ్లుగా వదిలేశాను. గత ఖరీఫ్‌లో సాగు చేసి పెట్టుబడి కూడా చేతికందలేదు. ప్రస్తుతం వర్షాలు లేవు. పంటలను సాగు చేసిన తిరిగి పెట్టుబడి దకకుతుందన్న నమ్మకం లేదు.

–గోపాల్‌రెడ్డి, కురబలకోట

ఏటా తగ్గుతున్న ఖరీఫ్ సాగు

సంవత్సరం	సాగు కావాల్సింది (హెక్టార్లలో)	బీళ్లు: (హెక్టార్లలో)
2022	86,795	56,062
2023	82,589	61,297
2024	65,386	40,990
2025	62,178	56,523

పంటల సాగు (హెక్టార్లలో)

పంట	లక్ష్యం	సాగైంది
వరి	12,002	1,764
జొన్న	26	2
బాజ్రా	501	59
మైజ్	2,028	626
రాగి	408	68
కందులు	2,670	197
బ్లాక్‌గ్రామ్	30	13
హార్స్‌గ్రామ్	2,595	2
కౌగ్రామ్	604	41
వేరుశెనగ	10,639	2,870

మండలాల వారీగా సాగు (హెక్టార్లలో)

మండలం	లక్ష్యం	సాగైంది
బి.కొత్తకోట	3,860	150
చిన్నమండ్యం	1,302	67
చిట్వేలి	126	14
గాలివీడు	3,212	126
గుర్రంకొండ	1,379	170
కలకడ	1,285	93
కలికిరి	2,198	176
కేవిపల్లె	3,429	239
కోడూరు	62	16
కురబలకోట	2,310	127
లక్కిరెడ్డిపల్లె	2,323	174
మదనపల్లె	2,586	182
ములకలచెరువు	4,621	952
నందలూర్	385	281
నిమ్మనపల్లె	2,469	191
ఓబులవారిపల్లె	137	55
పెద్దతిప్పసముద్రం	6,348	389
పెద్దమండ్యం	2,683	123
పెనగలూర్	266	115
పీలేరు	2,523	240
పుల్లంపేట	27	4
రాజంపేట్	385	227
రామాపురం	1,740	55
రామసముద్రం	2,601	97
రాయచోటి	1,361	92
సంబేపల్లె	2,463	196
టి.సుండుపల్లె	1,495	474
తంబళ్లపల్లె	3,930	265
వాల్మీకిపురం	2,369	178
వీరబల్లి	1,273	185

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు




క్షతగాత్రులు బాలకిష్ణంరాజు, నాగారున

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని నారాయణరెడ్డిపల్లె గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని 104 వాహనంలో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తున్న బాలక్రిష్ణంరాజు నారాయరెడ్డిపల్లె సచివాలయం నుంచి ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తున్నారు. తిరుపతి నుంచి రాయచోటికి మరో వాహనంలో నాగార్జున, బిందు దంపతులు వస్తున్నారు. రెండు వాహనాలు అదుపు తప్పడంతో ముగ్గురు కిందపడి గాయాలపాలయ్యారు. 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో మరో ముగ్గురికి

మదనపల్లె రూరల్ : వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కపలకోట మండలం అంగళ్లకు చెందిన అక్బర్ సాబ్ కుమారుడు ముస్తఫా(48) తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో కర్ణాటకలోని మురుగుముళ్ల దర్గాకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని రాయల్పాడు సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన మురారి(20), అతని స్నేహితుడు పురుషోత్తం(18) కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. పల్లె క్లాసు వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

యువకుడి బొటనవేలు కొరికేసిన కానిస్టేబుల్



వీరబల్లి : భూ తగాదా విషయంలో యువకుడి బొటనవేలు కానిస్టేబుల్ కొరికేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి వివరాల మేరకు.. వీరబల్లి మండలం ఈడిగపల్లిలో నివాసముంటున్న వీరబల్లి దయానందం కుమారుడు వేంకటేశ్వర్లు ప్రస్తుతం విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన వీరబల్లి శివకుమార్ కుమారుడు వినోద్ కుమార్‌తో వీరికి భూమి తగాదా ఉంది. శుక్రవారం ఈ విషయపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో వినోద్‌కుమార్ బొటనవేలును వేంకటేశ్వర్లు కొరికేయగా, అతడి కుమారుడు వినయ్ వినోద్ కుమార్ కారును పగులగొట్టారు. ఈ సంఘటనపై వినోద్‌కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్, అతడి కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు.

పదేళ్లుగా సబ్ కలెక్టరేట్‌లో పాగా..

- విధులు వేరే చోట.. కీలకమైన విభాగాలు వారి చేతిలోనే
- పట్టించుకోని సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు



రాజంపేట సబ్‌కలెక్టరేట్

రాజంపేట : రెవిన్యూ శాఖ గుండె లాంటింది సబ్ కలెక్టరేట్. ఈ శాఖలో ఎన్నో కీలక వ్యవహారాలు సాగుతుంటాయి. అయితే ఇద్దరు వ్యక్తులు కార్యాలయాన్ని తమ చేతుల్లోకి తీసుకుని నడిపిస్తున్నారే ఆరోపణలున్నాయి. పదేళ్ల నుంచి డిప్యూటేషన్ పేరుతో ఇక్కడే పాగా వేశారంటే.. ఏ స్థాయిలో వారి అధికారాలు చెల్లుబాటు అవుతున్నాయో తెలుస్తోంది. అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు. రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించిన కీలక వ్యవహారాల ఫైల్‌కు వీరి ఆమోదం లభించాలి. అప్పుడే రైతుల పనులు సక్రమంగా జరిగిపోతాయి. అన్ని వ్యవహారాలు ఆ ఇద్దరితోనే నేరుగా జరుగుతున్నాయని బహిరంగంగా చర్చ సాగుతోంది.

పదేళ్లుగా ఒకే చోట...

రెవెన్యూ పరంగా అసైన్‌మెంట్, వెబ్‌ల్యాండ్ కరెక్షన్, 22ఏ,(డాట్‌ల్యాండ్), ల్యాండ్ అసైనేషన్, అల్డినేషన్‌తోపాటు భూములకు సంబంధించి వివిధ పనులు చాలా కీలకం. పదేళ్ల నుంచి కీలకమైన ఆ విభాగాలకే ఆ ఇద్దరు ఉద్యోగులు పరిమితమయ్యారు. ఇతర మండల రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేయాల్సి ఉన్నా.. మళ్లీ డిప్యుటేషన్‌పై సబ్ కలెక్టర్‌కు వచ్చి కొనసాగుతున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. రెవెన్యూపరంగా అత్యధిక నాలెడ్జ్ కలిగిన అధికారులు చాలామంది ఉన్నా.. వీరితో ఎందుకు పనిచేయించుకుంటున్నారో తెలియడం లేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. వీరికి ఇక్కడ పనిచేసే అవకాశం కల్పించిన ఆ ఉన్నతాధికారి ఇపుడు పనిచేయడం లేదు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు మారినా.. వీరు మాత్రం ఫెవీకాల్ వీరుల్లా సబ్ కలెక్టరేట్‌లోనే ఉండిపోతున్నారు. కొన్నేళ్లుగా ఇలాంటి భూపరమైన కీలక విభాగాలు ఇద్దరి చేతిలో పెట్టుకున్నారంటే సబ్ కలెక్టరేట్‌లో రెవెన్యూ పరిపాలన పరిస్థితి ఏవిధంగా ఉందో ఇటే అవగతమవుతోంది.

పట్టించుకోని సబ్ కలెక్టర్, ఆర్డీవోలు

సబ్ కలెక్టరేట్‌లో ఇద్దరు ఉద్యోగులు కీలకమైన ల్యాండ్ వింగ్ రెవెన్యూ విభాగంలో డిప్యూటేషన్ సాకుతో ఏళ్ల తరబడి కొనసాగుతున్నారంటే కారణాలు అనేకమే ఉన్నాయనే విమర్శలున్నాయి. కొత్తగా వచ్చిన సబ్‌కలెక్టర్ గానీ, ఆర్డీవోలు గాని వీరి గురించి ఆలోచన చేయడం లేదు. రైతులు ఆ ఇద్దరి పైస్థాయి ఉన్నతాధికారులను కలవకుండా నేరుగా వీరి వద్దకు వచ్చి పని చక్కబెట్టుకొనిపోతుంటారనే ఆరోపణలున్నాయి. ఏళ్ల తరబడి ఒకే విభాగాన్ని అంటిపెట్టుకున్న వీరిని నూతనంగా నియమితులైన సబ్ కలెక్టర్ భావనతోనైనా ప్రక్షాళన జరుగుతుందా అని ఉద్యోగుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఏయే విభాగాలు ఎవరెవరు చూస్తున్నారనే అంశంపై ఇప్పటికే ఆమె దృష్టి సారించారు. భూపరమైన విభాగాలు తమ ఆధీనంలో ఉంచుకొని విధులు నిర్వహిస్తున్న వారి వ్యవహారంపై ఆమె ఏ విధంగా చర్యలు తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

రైతులను బెదిరించి.. డబ్బు డిమాండ్

ఇద్దరు నిందితుల అరెస్ట్



రైతులను బెదిరించి నగదు డిమాండ్ చేసిన నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె రూరల్ : వ్యవసాయ అవసరాలకోసం ఎద్దులు, ఆవు కొనుగోలు చేసి తమిళనాడుకు తీసుకువెళ్తున్న రైతుల వాహనాన్ని అడ్డగించి డబ్బు డిమాండ్ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలను ఆయన వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా ఆరణి తాలూకా మయూరు గ్రామానికి చెందిన రైతులు బాలాజీ, కమలకన్నన్ అనంతపురం జిల్లా గోరంట్ల పశువుల సంతలో వ్యవసాయ అవసరాల కోసం ఆవు, మూడు దూడలు, రెండు ఎద్దులను కొనుగోలు చేశారు. టీఎన్97ఏ1451 నెంబర్ లారీలో తమిళనాడుకు తీసుకువెళ్లేందుకు బయలుదేరారు. అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణం బైపాస్ రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం సమీపానికి చేరగానే.. పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన రాజేంద్ర ప్రసాద్ కుమారుడు చేగూరి నాగార్జున(36), నీరుగట్టువారిపల్లెకు చెందిన శివకుమార్ కుమారుడు ఉరుపు సురేష్‌కుమార్ (27) అడ్డుకున్నారు. పశువుల తరలింపునకు సంబంధించిన ధ్రువపత్రాలు చూపించమని అడిగారు. రైతులు ఇవ్వగా.. వాటిని చించి వాహనంతోపాటు వెళ్లాలంటే రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు ఒప్పుకోకపోవడంతో దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారు. అంతేగాక ఆ పశువుల యజమాని మురళిదాసానికి ఫోన్ చేసి నగదు ఇవ్వకపోతే మీ మనుషులను చంపేస్తామని బెదిరించారు. సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామంటూ కోర్టుభవన సముదాయం వద్దకు చేరుకోగా, నిందితులకు మద్దతుగా మరికొంతమంది వచ్చారు. రైతులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు సిద్ధమవడంతో నిందితులు పరారయ్యారు. రైతు బాలాజీ ఫిర్యాదు మేరకు సీఐ కళావెంకటరమణ కేసు నమోదు చేశారు. నిందితులైన నాగార్జున, సురేష్‌కుమార్‌లను చిప్పిలి హంద్రీనీవా కాలువ సమీపంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసులో మరింతమంది నిందితులు ఉన్నారని, విచారణ అనంతరం వారిని అరెస్టు చేస్తామన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ జట్లతో నిర్వాహకులు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి అండర్-22 విభాగంలో పురుషులు, మహిళల జట్లను శుక్రవారం ఎంపిక చేశారు. బాస్కెట్‌బాల్ క్రీడా జిల్లా ప్రెసిడెంట్ చింతల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడా కారులు హాజరయ్యారు. పురుషుల విభాగంలో మదనపల్లికి చెందిన పి.చైతన్య, వి.దీపేష్, ఎ.మానీష్, ఎం.వెంకటసాయి, ఎంఎస్ నిహార్, వాల్మీకిపురానికి చెందిన కె.కార్తికేయ, ఎస్.రెడ్డిశ్రీకర్, ఎస్.క్రిష్ణ కౌశిక్, ఎం.తరుణ్‌కుమార్, టి.అరవింద్, ఎస్.నియాజ్, తరిగొండకు చెందిన హేమంత్ ఎంపికయ్యారు. మహిళల విభాగంలో మదనపల్లికి చెందిన కె.హిమశ్రీ, కె.కౌశల్య, సీటీఎంకు చెందిన హరిశ్రిత, రేణుక, వాల్మీకిపురానికి చెందిన ఇ.హిమజ, తరిగొండకు చెందిన జి.గాయత్రి, ఎల్.హర్షిత, సి.స్వాతి, ఎం.మమత, జి.గాయత్రి, రామాపురానికి చెందిన నిహారిక, గుర్రంకొండకు చెందిన భవ్యశ్రీ, సబ్‌స్టిట్యూట్ ప్లేయర్‌లుగా మరో నలుగురిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ క్రీడా జిల్లా కార్యదర్శి రవి, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, పాఠశాల హెచ్ఎం వసుంధర, ఎస్ఐ చంద్రశేఖర్, పీడీలు కిరణ్, రెడ్డివరప్రసాద్, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పెట్రోల్ బంకులో గోల్‌మాల్

క్యూఆర్ కోడ్‌తో రూ.40 లక్షలు స్వాహా



బస్టాండు ఆవరణలోని పెట్రోల్ బంక్

రాజంపేట : రాజంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని పెట్రోల్ బంకులో భారీ గోల్‌మాల్ వెలుగుచూసింది. కొందరు సిబ్బంది తమ వ్యక్తిగత ఫోన్‌పే క్యూ ఆర్ కోడ్లు పెట్టుకుని నగదు మళ్లించుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై అధికారులు కాస్త పోలీసులకు ఫిర్యాదు చేయడంలో అసలు విషయం వెలుగు చూసింది. దీనిపై బస్టాండు పరిసర ప్రాంతాల్లో విచారించగా కొద్ది రోజులుగా ఈ పెట్రోలు బంకులో ఫోన్‌పేను నిషేధించినట్లు అక్రమాలే కారణమని స్థానికులు తెలిపారు. గత డిసెంబరు నుంచి ఇప్పటి వరకూ బంకుకు ఫోన్‌పే ద్వారా జమ చేసిన మొత్తం రూ.40 లక్షలు కొందరి వ్యక్తిగత ఖాతాలో జమైనట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈ వ్యవహారంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్రమ మద్యం పట్టివేత

ఒంటిమిట్ట : మండలంలోని కొండమాచుపల్లి-బాపనపల్లి మార్గంలో మదు శ్రీనివాస రెడ్డి(46)ఎనిమిది మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాలివాన బీభత్సం




కె.బాటవారిపల్లెలో నేలకూలిన చెట్టు

కలకడ : కలకడ మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కలకడ, కె.బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లెలో చెట్లు నేలకూలాయి. రేకులషెడ్లు కూలిపోయాయి. విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. దీంతో గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. గాలివాన వల్ల మండలవ్యాప్తంగా టమాట పంటలు దెబ్బతిన్నాయి.

ఉత్సాహంగా క్రీడల పోటీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 2025 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడల పోటీలు ఉత్సాహంగా సాగాయి. నగరంలోని క్రీడా పాఠశాలలో అర్చరీ, హాకీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు, డీఎస్ఏ క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాక్సింగ్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించగా క్రీడాకారులు ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన వారిని జట్టుగా ఏర్పాటుచేస్తామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 11న తిరుపతిలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

గాలిబండపై బైకర్లకు చెక్



ఫెన్సింగ్ పరిశీలిస్తున్న సీఐ

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లోని గాలిబండపై బైకర్ల హంగామాకు చెక్ పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బైకర్లు గాలిబండపై విన్యాసాలు చేస్తూ కిందకు వెళ్తుంటారు. ఇది చాలా ప్రమాదకమైనది కావడంతో పోలీసులు హెచ్చరిస్తున్నారు. అయినా హంగామా ఆగకపోవడంతో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర గాలిబండను పరిశీలించారు. బైక్‌లు వెళ్లే మార్గంలో ఇనుప కమ్మీలతో ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు శుక్రవారం దీనిని పరిశీలించి బందోబస్తుగా సిబ్బందిని ఏర్పాటుచేశారు. దీంతో ఇకపై బైకర్లు గాలిబండపైకి వెళ్లకుండా చెక్ పడింది.

బుద్ధునికొండ కథ సుఖాంతం

- డీఎస్పీ సమక్షంలో వీకేసీ, బాస్ నేతలతో చర్చలు
- రేపటి చలో మదనపల్లె నిరసన రద్దు



మదనపల్లె డీఎస్పీ మహేంద్రతో వీకేసీపార్టీ, బాస్ నేతలు

మదనపల్లె : నెలరోజులుగా మదనపల్లెలో ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన బుద్ధునికొండపై తథాగతుని తల వేరుచేసిన ఘటనపై వివాదం ముగిసింది. డీఎస్పీ మహేంద్ర పోలీసులు, సంఘాలతో సమావేశమై సమన్వయం నెలకొల్పడంతో ఉద్రిక్త పరిస్థితులకు తెరపడింది. గత జూలై 2వ తేదీన మదనపల్లె సమీపంలోని బుద్ధునికొండపై భారతీయ అంబేడ్కర్ సేన ప్రతిష్టించిన బుద్ధ విగ్రహం తల వేరుచేసి చేతుల్లో ఉంచిన ఘటన వెలుగుచూసింది. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్ డిమాండ్ చేయగా, పోలీసులు వీఆర్ఓ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిరాహారదీక్ష చేయడం, పోలీసులు భగ్నం ప్రయత్నం, తర్వాత అరగుండుతో నిరసనలు..ఈ వ్యవహారంపై బాస్ శ్రేణులపై మూడు కేసులు నమోదు చేయడంతో పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ పరిస్థితుల్లో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు తీవ్రం చేసిన బాస్ నేతలు..ఈ నెల 9న మదనపల్లెలో నిరసనకు పిలుపునిచ్చారు. ఇద్దరు మైనర్ పిల్లలు కారణమని ఎస్పీ ప్రకటించడం, దీన్ని బాస్ వ్యతిరేకించడం జరిగిపోయింది. డీఎస్పీ మహేంద్ర, సీఐలు సత్యనారాయణ, రామచంద్ర, వీకేసీ పార్టీ ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జి బాలసింగం, బాస్ ప్రతినిధులు కేవీ.రమణ, గణపతి, శ్రీనివాసులు, ముత్యాలమోహన్, దొరస్వామి తదితరులతో గురువారం చర్చలు జరిపారు. ఘటన దర్యాప్తు విషయంలో పరస్పరం సహకరించుకోవాలని డీఎస్పీ మహేంద్ర, సంఘాల నేతలు నిర్ణయించారు. కేసులపై న్యాయపరంగా ముందుకు తీసుకెళ్తామని డీఎస్పీ సూచించగా ఈ విషయంలో బాస్, వీకేసీలు పోలీసులకు సహకరిస్తారని స్పష్టం చేశారు. చలో మదనపల్లె నిరసన కార్యక్రమాన్ని రద్దు చేసుకుంటున్నట్లు వారు ప్రకటించారు. ఈ నెల 23న వీకేసీ పార్టీ జాతీయ అధ్యక్షుడు తిమావళవన్ మదనపల్లెకు వస్తున్నారని, బుద్ధునికొండ సందర్శించి అదే రోజు నూతన బుద్ధుని విగ్రహ ప్రతిష్ట చేస్తారని బాస్ నేతలు తెలిపారు. దీంతో ఇప్పటిదాకా నెలకొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది.


రామయ్య సన్నిధిలో వరలక్ష్మీ వ్రతం




సౌభాగ్యం కార్యక్రమంలో మహిళలు, ప్రత్యేక అలంకరణలో సీతారామ,లక్ష్మణులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండరామాలయంలో వరలక్ష్మీ వ్రతం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలతో పవన్‌కుమార్, మనోజ్‌కుమార్‌లు శాస్త్రోక్తంగా వ్రతాన్ని చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తే ధన, ధాన్య, ఐశ్వర్యాలు కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు. అనంతరం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పుస్తక ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, సూపరింటెండెంట్ హనుమంతయ్య, భక్తులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయానికి నీరు విడుదల



మైలవరానికి తరలిస్తున్న కృష్ణజలాలు

కొండాపురం : గండికోట జలాశయం గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి ఐదువేల క్యూసెక్కుల నీటిని శుక్రవారం విడుదల చేసినట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆవుకు రిజర్వాయర్ నుంచి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 13 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ప్రాజెక్టులోకి కొనసాగుతున్నట్లు తెలిపారు. జలాశయం పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 16 టీఎంసీల నిల్వలు ఉన్నాయని తెలిపారు. శెట్టివారిపల్లె మెయిన్ రెగ్యులేటర్ నుంచి గాలేరి నగరి సృజల స్రవంతి కాల్వ ద్వారా వామికొండ రిజర్వాయర్‌కు 300 క్యూసెక్కుల నీరు తరలిస్తున్నామన్నారు. గండికోట ఎత్తిపోతలపథకం ద్వారా నాలుగు మోటర్లతో నీటిని చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని బోడుమల్లదిన్నెకు చెందిన శ్రీనివాసులు, విజయమ్మ దంపతుల కుమారుడు వేణుగోపాల్(20) తల్లిదండ్రులు మృతి చెందడంతో తాత వెంకటరమణ వద్ద ఉంటున్నాడు. ప్రతిరోజూ పశువులను మేతకు తీసుకు వెళ్తూ చేదోడువాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో ఇటీవల కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో ఇంట్లో వారు మందలించగా మనస్థాపానికి గురైన వేణుగోపాల్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా మొలకలచెరువు మండలం గుర్రాజుపల్లికి చెందిన శంకర కుమారుడు మధుకర్(28) జెసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలతో మధుకర్ భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన మధుకర్ శుక్రవారం ఇంటివద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వేణుగోపాల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.


రోడ్డు ప్రమాదంలో న్యాయవాది దుర్మరణం

వల్లూరు : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని శ్రీసత్యా గ్రీన్‌సిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాయపల్లె గ్రామానికి చెందిన న్యాయవాది డి.శ్రీనివాసులురెడ్డి(46) మృతిచెందారు. ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపిన సమాచారం మేరకు... న్యాయవాది శ్రీనువాసులురెడ్డి తన గ్రామం గంగాయపల్లె నుంచి బైక్‌లో కడపకు వెళ్తున్నారు. మార్గ మధ్యంలో శ్రీసత్యా గ్రీన్ సిటీ వద్దకు రాగానే కడప ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో మృతుడు తన బైక్‌ను బస్సు వెనుకభాగాన ఢీకొన్నాడు. మృతునికి తీవ్ర గాయాలవగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడపకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులురెడ్డి మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుడికి భార్య, ఆరు నెలల పాప ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం : భూ సమస్యలతో పురుగు మందు తాగిన లింగాలదిన్నెపల్లెకు చెందిన భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ప్రాణాలు కొట్టుమిట్టాడుతూ ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందాడు. గత సోమవారం పురుగులమందు తాగి ఆయన ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు ప్రొద్దుటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుడి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని లింగాలదిన్నెపల్లెకు చెందిన తెదేపా నేత లెక్కల రమణారెడ్డి, మరికొందరు భూ సమస్యపై సుబ్బిరెడ్డిపై ఒత్తిడి తేవడంతో మానసికంగా కుంగిపోయారని, సోమవారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడన్నారు. 108లో ప్రొద్దుటూరు ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా శుక్రవాంర ప్రాణాలు వదిలారని తెలిపారు. సుబ్బిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఈ మధ్య ఒక్కగానొక్క కుమారుడు ఆత్మహత్య చేసుకోగా, ఇపుడు భర్త మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సుబ్బిరెడ్డి భార్య, పిల్లలు కోరుతున్నారు.

గండి ఆంజన్న దర్శనానికి ఏర్పాట్లు



గండి వీరాంజనేయుడు



శుక్రవారం రాత్రికే గండికి చేరుకున్న భక్తులు

చక్రాయపేట : శ్రావణమాసంలో మూడో శనివారం రోజున భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య, చైర్మన్ కావలికృష్ణతేజ తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం లడ్డూ, పులిహోర ప్రసాదాలను సిద్ధం చేశామని తెలిపారు. రాత్రి బసచేసే వారి కాలక్షేపానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాతలు అన్నదానం చేస్తారన్నారు. వీఐపీ పాసులు పొందినవారు నిర్ణయించిన సమయంలో వస్తేనే అనుమతిస్తామని తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల లోపు వచ్చి దర్శనం చేసుకోవాలన్నారు. గత శనివారం జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు మాట్లాడుతూ ఉదయం మూడు గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం(ఏకాంతం), అలంకరణ, ఆరాధన, ఐదు గంటలకు మహామంగళ హారతి నిర్వహించి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు.

స్వామి సన్నిధిలో తిరుపతి జిల్లా జడ్జి

గండి వీరాంజనేయ స్వామిని శుక్రవారం సాయంత్రం తిరుపతి జిల్లా జడ్జి రామచంద్రుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్సై రంగనాయకులు పాల్గొన్నారు. సీఐ మాట్లాడుతూ మూడో శనివారం కావడంతో పులివెందుల డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 200 మంది పోలీసులు, హోంగార్డులు, మహిళా పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. వాహనాలను గండిలోకి అనుమతించమని వారు తెలిపారు.